## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థినులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

**ముదిగొండ:** రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు యడవల్లి విద్యార్థినులు ఎంపికైనట్లు పీడీలు కె.ఆదర్శ్, బి.కృష్ణయ్య శనివారం తెలిపారు. శుక్రవారం వీవీపాలెం సెడార్ వ్యాలీ స్కూల్ మైదానంలో జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా జూనియర్ ఫుట్‌బాల్ ఎంపిక పోటీల్లో యడవల్లి జెడ్పీహెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థినులు దొంతగాని పావని, దుశర్ల యశ్వంతి ఎంపికయ్యారు. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపురంలో ఈ నెల 9 నుంచి 12 వరకు జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినులను హెచ్‌ఎం నాగలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

### పీహెచ్‌సీని.. సీహెచ్‌సీగా మార్చాలి

**కారేపల్లి:** కారేపల్లిలోని పీహెచ్‌సీని సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)గా మార్చాలని, 50 పడకల ఆస్పత్రి, 24గంటల వైద్యసదుపాయం కల్పించాలని ఐద్వా జిల్లా అధ్యక్షుడు మెరుగు రమణ, మండల కార్యదర్శి ఉమావతి పేర్కొన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో కారేపల్లి పీహెచ్‌సీని శనివారం సందర్శించి, వసతులపై ఆరా తీశారు. సింగరేణి మండలంలో 60వేల జనాభాకు గాను కేవలం ఒక్క పీహెచ్‌సీ మాత్రమే ఉందని, అరకొర వసతులతో పేదలకు సరైన వైద్యం అందటం లేదన్నారు. పల్లెల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందిచాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు లక్ష్మి, నీలిమ, వరలక్ష్మి, గురవమ్మ, సరోజిని పాల్గొన్నారు.

### విధుల్లో చేరిన సీఐ శ్రీహరి


సీఐ శ్రీహరి

**సత్తుపల్లిటౌన్:** సత్తుపల్లి పట్టణ సీఐగా తుమ్మలపల్లి శ్రీహరి శనివారం బాధ్యతలు స్వీకరించి విధుల్లో చేరారు. ఆయన ఖమ్మం మహిళా పోలీస్‌స్టేషన్ సీఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలోఖమ్మంలోని ఖానాపురం హవేలి సీఐగా పని చేశారు.

### బాధ్యతలు చేపట్టిన ఎస్సై హరిత



సీఐకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్సై హరిత

**ముదిగొండ:** ముదిగొండ పోలీస్ స్టేషన్‌లో గత మూడు నెలల నుంచి ట్రెయినీ ఎస్సైగా విధులు నిర్వర్తించిన జి.హరిత శనివారం అదనపు ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ మురళిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.



# నిగనిగలాడే నేరేడు..

- పండ్లకు కేరాఫ్ మంగాపురం, కొత్తగూడెం రోడ్డు
- జోరుగా కొనుగోళ్లు

సండే స్పెషల్

**తల్లాడ:** మార్కెట్లో ఎక్కడ చూసిన నేరేడు పండ్లు కనిపిస్తున్నాయి. ప్రతి ఏటా సీజన్‌లో దొరికే ఈ పండ్లను తింటే ఆరోగ్యానికి మేలు చేకూరుస్తాయి. సహజ సిద్ధంగా ఎలాంటి మందులు కొట్టకుండానే చెట్లకు కాసే ఈ కాయలను చూడగానే నోరూరిపోయి తినాలనిపిస్తుంది. నిగనిగలాడే నేరేడు పండ్లు పలు వ్యాధుల నివారణకు దోహదం చేస్తాయి.

**మంగాపురం, కొత్తగూడెం రోడ్డులో..**

నేరేడు చెట్లు(గిన్నె) తల్లాడ నుంచి మంగాపురం వెళ్లే రోడ్డు, తల్లాడ నుంచి కొత్తగూడెం వెళ్లే రోడ్డులో పదుల సంఖ్యలో ఉన్నాయి. రోడ్డు కిరువైపులా ఈ చెట్లు పెరిగాయి. ఇవి వేసవికాలంలో నీడనివ్వంటంతో పాటు వర్షాకాలంలో పండ్లను ఇస్తాయి. సుమారు 50 వృక్షాలు పెద్దవై పండ్లనిస్తున్నాయి. వాటితో పాటు చిన్న చిన్న వృక్షాలు కూడా ఉన్నాయి. పాదాచారులకు, బాట సారులకు, చల్లటి నీడనివ్వటంతోపాటు పండ్లను ఇస్తున్నాయి.

**నేరేడులో ఔషధ గుణాలు..**

నేరేడు పండ్లు శరీరానికి చలువ చేస్తాయి. జిగట విరేచనాలతో బాధ పడేవారికి నేరేడు పండ్ల రసాన్ని రెండు నుంచి మూడు చెంచాల చొప్పున ఇవ్వాలి. రోగికి శక్తితోపాటు పేగుల కదలికలు నియంత్రణలో ఉంటాయి. కాలేయం పని తీరు క్రమబద్ధీకరిండానికి, శుభ్ర పర్చడానికి నేరేడు దివ్య అవౌషదంలా పనిచేస్తుంది. ఈ పండులోని యాంటీ ఆక్సిడెంట్లు మెదడుకు గుండెకు ఔషదంగా పని చేస్తాయి. జ్వరంగా ఉన్నప్పుడు దనియాల రసంలో నేరేడు రసం కలిపి తీసుకుంటే... శరీర తాపం తగ్గుతుంది. మూత్రం మంట తగ్గడానికి నిమ్మరసం, నేరేడు రసం రెండు చెంచాల చొప్పున నీళ్లలో కలిపి తీసుకోవాలి. గర్భిణలు మాత్ర ఎట్టి పరిస్థితిలో తిసుకోకూడదు.


మంగాపురంలో రోడ్డుకిరువైపులా నేరేడు చెట్లు

**ఆకులు, బెరడు వల్ల ఉపయోగాలు**

నేరేడు చెట్టు ఆకులు, బెరడు గింజలు కూడా మేలు చేస్తాయి. నేరేడు ఆకులతో కషాయం చేస్తే బ్యాక్టీరియల్, వైరల్ ఇన్‌ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది. ఆకులను దంచి కషాయంగా కాచి పుక్కిలిస్తే దంతాలు కదలడం, చిగుళ్ల వాపులు, పుండ్లు వంటివి త్వరగా తగ్గుతాయి. ఆకులను నమిలి నీళ్లతో పుక్కిలించి ఉమ్మి వేస్తే.. నోటి దుర్వాసన తగ్గుతుంది. ఆకు రసంలో పసుపు కలిపి పురుగులు కుట్టిన చోట, దురదలు, సాదారణ దద్దుర్లుకు లేపనంగా రాస్తుంటే ఉపశమనం లభిస్తుంది. నెలసరి సమస్యలకు నేరేడు చెక్క కషాయాన్ని25 రోజులపాటు 30 ఎమ్‌ఎల్ చొప్పున రోజుకు రెండుసార్లు తీసుకోవాలి. విత్తనం నుండి తీసిన రసం అదిక రక్తపోటును నయం చేస్తుంది. మదుమేహానికి కూడా పని చేస్తుంది. కాలేయం పని తీరును మెరుగు పరిచడం, రక్తకేన్సర్, కారకాలను నిరోదిస్తాయి. శరీరంలోని ఎర్రరక్తకనాలను వృద్ధి చేయడంతోపాటు, రక్తహీనత తగ్గుతుంది. ఎముకలక పుష్టి ఇవ్వడంతో పాటు గుండెపోటును నివారిస్తుంది.

### ఎన్నో సుగుణాల నేరేడు


సత్తుపల్లిలో నేరేడు పండ్లను కొనుగోలు చేస్తున్న మహిళలు

**సత్తుపల్లిటౌన్:** వానకాలం సీజన్ రాగానే అల్ల నేరేడు పండ్లు మార్కెట్‌లోకి వచ్చేశాయి. సత్తుపల్లిలో రాజమండ్రి, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి తెచ్చి విక్రయిస్తున్న నేరేడు పండ్లు నోరూరిస్తున్నాయి. ఆరోగ్యానికి ఎంతో మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

### ఆరోగ్యానికి మంచిది..



పుల్లగా, తియ్యగా ఉండే నేరేడు పండు ఆరోగ్యానికి ఎంతో మంచిది. దీనిని తీసుకుంటే దివ్యఔషదంలా పనిచేస్తుంది. ఇవి ఈ సీజన్‌లో విపరీతంగా కాయలు కాస్తుంటాయి. పొలాలకు వెళ్లేటప్పుడు, తిరిగి వచ్చేటప్పుడు వీటిని తీసుకుంటాం. పలువురు వాహనదారులు కూడా రోడ్డు వెంట ఉన్న కాయలను రుచి చూస్తుంటారు. మూడు నెలల పాటు ఈ కాయలు కాస్తుంటాయి.

– నంబూరి నారాయణరావు, తల్లాడ

# నానో యూరియా వాడాలి


కారేపల్లి: మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

**మధిర/కారేపల్లి:** యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డీఏపీను వాడాలని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య, మధిర వ్యవసాయ సంచాలకులు ఎస్ విజయ్ చంద్ర రైతులకు సూచించారు. శనివారం వారు కారేపల్లి మండలంలో, మధిరలో పర్యటించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నానో యూరియా, నానో డీఏపీలను వాడటం వలన ఎరువు వృధా కాకుండా మొక్కలకు సరిపడ అందుతుందన్నారు. దీంతో రైతుకు పెట్టుబడి తగ్గటంతో పాటు, పంటకు మంచిదన్నారు. ఎరువులను ఎమ్మార్పీ ధరలకు మించి అమ్మినా, బ్లాక్ మార్కెట్‌లో అమ్మినా వారిపై చర్యలు తప్పక ఉంటాయన్నారు. ఈ ఏడాది జిల్లాలో రైతులు జూన్ చివరి మాసం వరకు వేశారని, దీంతో జిల్లా వ్యాప్తంగా సుమారు 2.50లక్షల ఎకరాల్లో పత్తి పంటను రైతులు సాగు చేస్తున్నారన్నారు. ఎరువులను అవసరాలకు మించి అందుబాటులో ఉంచినట్లు, రైతులు ఎరువుల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మధిర మండలంలో పామాయిల్ సాగు విస్తీర్ణాన్ని పెంచాలన్నారు. వీరివెంట మండల వ్యవసాయాధికారుల బి.అశోక్‌కుమార్, కె.సాయిదీక్షిత్, ఏఈఓ బి.నరేష్, టి.జిష్ణు, సొసైటీ డైరెక్టర్ కొత్తూరి రామారావు, ఆత్మ కమిటీ డైరెక్టర్ శ్రీలక్ష్మి, రైతులు ఉన్నారు.

# లబ్ధిదారుల వివరాలు తెలపాలి


మాట్లాడుతున్న మండల స్పెషలాఫీసర్ నవీన్‌బాబు

**కారేపల్లి:** సింగరేణి మండలానికి ఐటీడీఏ నుంచి మంజూరైన 390 ఇందిరమ్మ కాగా, లబ్ధిదారుల వివరాలను ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇవ్వాల్సిందిగా మండల స్పెషలాఫీసర్ నవీన్‌బాబు తెలిపారు. శనివారం కారేపల్లి మండల పరిషత్ సమావేశం మందిరంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. మండలానికి అదనంగా మంజూరైన 250ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు అందించడం జరుగుతుందన్నారు. వార్షకాలం దృష్ట్యా వైద్యసిబ్బంది, కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ రవీంద్రప్రసాద్, ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పట్టుదలతో చదివితే ఏదైనా సాధించవచ్చు

**ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులకు సన్మానం**

**వైరా:** విద్యార్థులు పట్టుదలతో చదివితే ఏదైనా సాధించవచ్చని వైరా ఎస్సై పి.రామారావు అన్నారు. మండలంలోని రెబ్బవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన జె.మాధవి, షేక్ జమీనా విద్యార్థులు అత్యధిక మార్కులతో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారన్నారు. వీరిని ఎస్సై ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వరరావు, దొడ్డా వరప్రసాద్, సూర్య ప్రకాశ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**'భరత్' విద్యార్థులు..**

**మధిర:** మధిర పట్టణంలోని భరత్ స్కూల్‌లో చదివిన నలుగురు విద్యార్థులకు బాసర ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించారని భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి పేర్కొన్నారు. తమ పాఠశాలలో విద్యనభ్యసించిన శీలం రాజశేఖర్‌రెడ్డి(579/600), నరెడ్ల దేవహర్షారెడ్డి577, మోక్షజ్ఞ 570,శీలం నందు 566లకు బాసర ట్రిబుల్ ఐటీ, ఒంగోలు ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా మాటూరు, మడుపల్లి, టీవీఎం పాఠశాలల్లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు కూడా ట్రిబుల్ ఐటీ సీట్లు సాధించారు.

**జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థి..**


శ్రీహర్షితను అభినందిస్తున్న హెచ్‌ఎం దయాకర్‌రెడ్డి

**సత్తుపల్లి:** మండలంలోని తుంబూరు జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలకు చెందిన పూరేటి శ్రీహర్షిత బాసరలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైందని పాఠశాల హెచ్‌ఎం దేశిరెడ్డి దయాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించటం పట్ల ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, ఎస్‌ఎంసీ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

**జమలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి..**

**ఎర్రుపాలెం:** మండలంలోని జమలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పాముల వరుణ్ సందేశ్ ట్రిబుల్ ఐటీలో సీటు సాధించాడు. బాసరలో ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. కాగా శనివారం పాఠశాల హెచ్‌ఎం నాగులవంచ జ్యోతిశ్రీ, ఉపాధ్యాయులు సందేశ్‌ను అభినందించారు.

# రహదారి కోసం రైతుల నిరసన


గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

**వైరా:** గ్రీన్‌ఫీల్డు హైవే పక్కన వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు సమీపంలో రైతులు పొలాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పలువురు రైతులు శనివారం పనులు అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. రూ.కోటి విలువైన భూములకు గ్రీన్ ఫీల్డు హైవే కోసం రైతుల నుంచి బలవంతంగా తీసుకున్న ప్రభుత్వం రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు దారి లేకుండా అడ్డు గోడలు కట్టి వేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు రామారావు, రామయ్య, రవి, బాధిత రైతులు పాల్గొన్నారు.

**రాజకీయ శిక్షణా తరగతులు..**

**ఏన్కూరు:** స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సీపీఎం రాజకీయ శిక్షణా తరగతుల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు పాల్గొని మాట్లాడారు. 8గంటల పనిదినాన్ని 12 పొడిగించేందుకు మోదీ శ్రీకారం చుట్టారన్నారు. జూలై 9న జరిగే దేశవ్యాప్తిత సార్వత్రిక సమ్మెలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపియం మండల కార్యదర్శి నాగేశ్వరావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఐఏఎల్ డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

**మధిర:** ఇండియన్ అసోసియేషన్ లాయర్స్ (ఐఏఎల్) మధిర డివిజన్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా న్యాయవాదులు గంధం శ్రీనివాసరావు, కోట జ్ఞానేశ్, ఉపాధ్యక్షుడిగా కె.విజయ్ కుమార్, కోశాధికారిగా పుట్టా శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మధిర పట్టణంలోని రిక్రేషియన్ క్లబ్‌లో ఐఏఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టడీ సర్కిల్ మీటింగ్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వీరిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.ఉదయ భాస్కర్, జిల్లా అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, ఉపాధ్యక్షులు వెంకట్రావు, గౌరవ జిల్లా అధ్యక్షులు అమర్‌చంద్, సహాయ కార్యదర్శి పట్టాభి, ఖమ్మం టౌన్ కమిటీ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, సీనియర్ న్యాయవాది, రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్వరరావు ఉన్నారు.

### ఎరువుల కొరత ఉండొద్దు..

**కొణిజర్ల:** ప్రభుత్వం ఎరువుల కొరత లేకుండా చూడాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు ఎస్‌కే ఖాసీమ్ డిమాండ్ చేశారు. శనివారం కొణిజర్లలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో డీఏపీ, యూరియా వంటి ప్రధాన ఎరువులు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు పాల్గొన్నారు.

### ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరికి గాయాలు

**ముదిగొండ:** ముదిగొండలోని మద్యం దుకాణాల సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ముదిగొండకు చెందిన కమర్తపు సత్యనారాయణ అనే వ్యక్తికి తీవ్ర గాయాలైయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై పోలీస్‌లు కేసు మోదు కాలేదని తెలిపారు.

### భూవివాదంలో దాడి.. కేసు నమోదు

**బోనకల్:** మండలంలోని పెద్దబీరవల్లి రెవెన్యూ పరిధిలో శనివారం భూ వివాదంలో జరిగిన ఘర్షణలో వేల్పుల శ్రీనివాసరావు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు.. నాగటి లక్ష్మి, నాగటి ప్రాన్సిస్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పొదిలి వెంకన్న తెలిపారు.

**పొలంగెట్ల విషయంలో ఘర్షణపై..**

**చింతకాని:** చింతకాని గ్రామానికి చెందిన దేశిబోయిన వెంకటేశ్వర్లు, చింతల పుల్లయ్య మద్య పొలం గెట్ల విషయంలో శనివారం వివాదం నెలకుంది. ఈ సంఘటనలో కోపోద్రిక్తులైన పుల్లయ్య రాయి విసరగా వెంకటేశ్వర్లుకు గాయమైంది. వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

### మిషనరీ పేరిట మోసంపై కేసు

**బోనకల్:** ప్రింటింగ్ ప్రెస్ మిషనరీ ఇస్తానని నగదు తీసుకుని మోసం చేశారని అందని ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.వెంకన్న తెలిపారు. చింతకాని మండలం నాగులవంచకు చెందిన మురికిపుడి నాగరాజు బోనకల్‌లో ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తున్నాడు. ఆయనకు విజయవాడ వాసి సూరంపూడి లక్ష్మీప్రదీప్ మిషనరీ ఇస్తానని చెప్పి ఖాతాలో రూ.9.50లక్షలు జమ చేయించుకున్నాడు. ఆపై రూ.2.36లక్షల విలువైన విడి భాగాలు పంపించి ముఖం చాటేయడంతో నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

### విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**తల్లాడ:** విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి తాళ్లూరి వేణు అన్నారు. శనివారం తల్లాడలో ఆ సంఘం కార్యాలయంలో.. మండల అధ్యక్షుడు కె.రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 16 నెలలుగా రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రిటైర్డ్ ఉద్యోగుల పట్ల రాష్ట ప్రభుత్వ వైఖరి మారాలన్నారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దగ్గుల రఘుపతిరెడ్డి, లక్ష్మయ్య, తిరుపతిరెడ్డి, బ్రహ్మయ్య, పఠాన్ మదార్ ఖాన్, అనసూర్యమ్మ, మున్నీ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# వైద్య శిబిరం విజయవంతం


శిబిరంలో మందులు అందిస్తున్న మట్టా దయానంద్

**కల్లూరు:** స్థానిక ఎన్నెస్పీలోని ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్‌లో కల్లూరు ఆస్పత్రి వైద్యాధికారి నవ్యకాంత్ ఆధ్వర్యంలో శనివారం టీబీ వ్యాధిపై వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి లక్షణాల గురించి వివరించి, అనుమానితులతో తెమడ పరీక్షకు శాంపిల్స్ సేకరించారు. అనంతరం మందులు అందించారు. వైద్యాధికారి వినిత్ మాట్లాడుతూ.. టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా మందులు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ రామారావు, ల్యాబ్ సూపర్‌వైజర్ సంజీవ్‌కుమార్, ఏఎన్‌ఎం భారతి, నాగమణి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం**

**సత్తుపల్లిటౌన్:** పట్టణంలోని ద్వారకాపురి కాలనీలో గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ సహకారంతో శనివారం బైబిల్‌మిషన్ కార్మెల్‌షారోను సొగసు మహిమాలయం రాకడ ఏసురత్నం మెమోరియల్ ఆధ్వర్యాన ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు మట్టా దయానంద్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సత్తుపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్నారావు, వరప్రసాద్, అబ్దుల్ గఫార్ ఖాన్, రవికిరణ్, అజయ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### స్థలం కేటాయించండి


తహసీల్దార్ సాంబశివుడుకు వినతిపత్రం అందిస్తున్న బీసీ సంఘం నాయకులు

**కల్లూరురూరల్:** కల్లూరు పట్టణ కేంద్రంగా బీసీ భవన్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా బీసీ సంఘ నాయకులు శనివారం కల్లూరు తహసీల్దార్ పులి సాంబశివుడుకు విజ్ఞాపన పత్రం అందించి.. తహసీల్దార్‌ను, ఆర్డీఓ రాజందర్‌గౌడ్‌ను శాలువాలతో సన్మానించి.. మహాత్మా జ్యోతిరావుపూలే చిత్రపటాలను అందించారు. కార్యక్రమంలో ప్రభాకర్ చౌదరి, సత్యనారాయణరెడ్డి, సయ్యద్ గౌస్, బీసీ నాయకులు బాజీ, కృష్ణ, నరేందర్, నర్సింహారావు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



ఎర్రుపాలెం: మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వీరయ్య

**ఎర్రుపాలెం/బోనకల్/కారేపల్లి/తల్లాడ:** ఈ నెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వామపక్ష నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం ఎర్రుపాలెం మండల కేంద్రలో అఖిలపక్ష నాయకులు, బోనకల్ మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నాయకులు సమావేశం నిర్వహించారు. అదే విధంగా కారేపల్లిలోని ఉసిరికాయలపల్లి సోలార్ ప్లాంట్ వద్ద టీయూసీఐ ఆధ్వర్యంలో కార్మికులు కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. తల్లాడలో సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కార్మిక సంఘం నాయకులు ఎంపీడీఓ సురేష్‌బాబు, తల్లాడ పంచాయతీ ఈఓ కృష్ణారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ అవలంభిస్తున్న కార్మిక చట్టాల మార్పుల వల్ల ఉద్యోగ భద్రత కోల్పోతున్నారని, దేశ సంపదను ధనవంతులకే దోచి పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దేశవ్యాప్త సమ్మె కేంద్ర ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా జరగనున్న ప్రజా పోరాటమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, దొండపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శులు ప్రభాకర్ రావు, ఆనందరావు, సురేష్, టీయూసీఐ జిల్లా నాయకుడు ధరావత్ సక్రు, సీఐటీయూ, కాంగ్రెస్, సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మహిళా గురుకులంలో బ్రిడ్జి కోర్సు ప్రారంభం


మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్

**కొణిజర్ల:** మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో నూతన విద్యా సంవత్సరానికి గాను శనివారం బ్రిడ్జి కోర్సును ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డు జడ్జి గ్రేట్ సన్ ఆఫ్ సాయిల్ అవార్డు గ్రహీత జస్టిస్ చంద్ర కుమార్ ముఖ్య అతిథిగా హాజరై బాలికలనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజిత, వైస్ ప్రిన్సిపాల్ నవ్య, వివిధ విభాగాల కోఆర్డినేటర్‌లు ఐశ్వర్య, రజనీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రాలకు ఇన్వర్టర్లు వితరణ**

**ఏన్కూరు:** అమెరికాలోని న్యూజెర్సీ చెందిన ఎన్ఆర్ఐ బత్తుల అభి మండలంలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాలకు 5 సోలార్ ఇన్వర్టర్లు స్థానిక మండల పరిషత్ కార్యాలయలో శనివారం ఐసీడీఎస్ సీడీపీఓ దయామణికి అందించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కరెంట్ వసతిని కల్పించాలని 5 ఇన్వర్టర్లు, రెండు ఫ్యాన్లు, రెండు ట్యూబ్‌లైట్స్, వైరింగ్ అందజేశారు. కార్యక్రమంలో కామేపల్లి సీడీపీఓ నారపరాజు,లయన్స్‌క్లబ్ సభ్యులు జానకిరామయ్య, సరోజిని, సుధారాణి, దియా పాల్గొన్నారు.

**సేవ చేయడంలోనే నిజమైన తృప్తి**

**బోనకల్:** అనాధలకు సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి లభిస్తుందని మధిర నియోజకవర్గ ఆత్మా కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరావు అన్నారు. లేళ్ల కార్తిక్ జన్మదినం సందర్భంగా శనివారం బోనకల్ వృద్ధాశ్రమం, శాంతినిలయంలోని మానసిక దివ్యాంగులకు భోజనం ఏర్పాటు చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, నాగేశ్వరరావు, సతీష్, సురేంద్రకుమార్, కార్తీక్ పాల్గొన్నారు.

**పుణ్యక్షేత్రాలకు.. ఆర్టీసీ బస్సు**

**సత్తుపల్లిటౌన్:** ఆర్టీసీ డిపో ఆధ్వర్యాన మూడు పుణ్యక్షేత్రాల యాత్ర శనివారం చేపట్టారు. డిపో నుంచి డీలక్స్ బస్సులో వెళ్లే భక్తులను పారిజాతకొండ, వాడపల్లి, ద్వారకా తిరుమల పుణ్యక్షేత్రాల దర్శనం ఏర్పాటు చేశారు. ఈ యాత్ర బస్సును డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి ప్రారంభించారు. పట్టణానికి చెందిన శ్రీభక్తాంజనేయ భజన బృందం నిర్వాహకులు కొప్పుల రజిని ఆధ్వర్యాన 40 మంది భక్తులు ఈ యాత్రల ద్వారా పుణ్యక్షేత్రాలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో వీబీఓ కిన్నెర ఆనందరావు, డీఐ బి.ప్రభాకర్, కంట్రోలర్ చిన్నప్పరెడ్డి పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేయాలి**

**ముదిగొండ:** పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్ షిప్ బకాయిలను విడుదల చేసి, సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు కొమ్ము మహేష్ అన్నారు. శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ముదిగొండలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులచే నిరసన ప్రదర్శన నిర్వహించారు. సమస్య పరిష్కరించకపోతే మంత్రుల క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనాథ్, భరత్, సాయికృష్ణ, మనోజ్, పృథ్వి, వరుణ్‌కుమార్, కల్యాణ్, ప్రియాంక, రాజేశ్వరి, స్వాతి పాల్గొన్నారు.

**బీఎల్‌ఓలకు శిక్షణ**

**ఏన్కూరు:** స్థానిక రైతువేదికలో శనివారం బూత్‌లెవల్ అధికారులకు ఎన్నికలకు సంబందించిన అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో భాగంగా బీఎల్ఓలకు మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. ఫామ్ 6,7,8 తదితర వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు పాల్గొన్నారు.

**మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా**

**వైరా:** వైరా మున్సిపాలిటీ రెండో వార్డులో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం వార్డుకు చెందిన నిరుపేదలు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. గుడిసెలో బతుకుతున్న మా పేర్లు మొదటి లిస్టులో ఉన్నా.. ఇందిరమ్మ పట్టాలు ఇచ్చే సమయానికి తమ పేర్లు తొలగించారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, మంజుల, వెంకటరమణ, రజిని, అశ్విని, ఉష, మల్లేశ్వరి పాల్గొన్నారు.

**కిష్టారం ఓసీ హెచ్‌ఎంఎస్ పిట్ సెక్రటరీగా అబ్దుల్ మొగిలి**

**సత్తుపల్లిరూరల్:** మండలంలోని కిష్టారం ఓసీలో హెచ్‌ఎంఎస్ యూనియన్ పిట్ సెక్రటరీగా అబ్దుల్ మొగిలిని నియమించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంఎస్ యూనియన్ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు మొగిలికి నియామక పత్రం అందించారు. ఆ పత్రాన్ని ఓసీ పీఓ నర్సింహారావు మేనేజర్ రామకృష్ణలకు ఆయన అందించారు. కార్యక్రమంలో సీహెచ్ భద్రయ్య, సత్తుపల్లి ఇన్‌చార్జ్ ఎండి ఆజగర్ ఖాన్, జేవీఆర్ ఓసీ-2 పిట్ సెక్రటరీ వి.శ్రీనివాస్, నసీంఖాన్, మధుర శ్రీనివాస్, కొత్తగూడెం ఏరియా ఆర్గనైజింగ్ సెక్రటరీ వరానంద్, మచ్చ మోహన్‌రావు పాల్గొన్నారు.

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం..**

**సత్తుపల్లి:** తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఎన్.రామచంద్రరావును హైదరాబాద్‌లో బీజేపీ ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ నంబూరి రామలింగేశ్వరరావు, సత్తుపల్లి, వేంసూరు మండలాల నాయకులు శనివారం కలిసి సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు, బీజేపీ తరుపున శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యులు మట్టా ప్రసాద్, వేంసూరు మండల అధ్యక్షులు గొర్ల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

**మాజీ ఎమ్మెల్యే పరామర్శ**

**కారేపల్లి:** మండలంలోని గేటుకారేపల్లికి చెందిన తేళ్ల వెంకటేశ్వర్లు(93) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబీకులు శ్రీనివాసరావు, నాగేశ్వరరావును మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ శనివారం పరామర్శించారు. అలాగే, బీఆర్ఎస్ నాయకుడు తోటకూరి పిచ్చయ్యను కూడా కలిశారు. నాయకులు ముత్యాల సత్యనారాయణ, రావూరి శ్రీనివాసరావు, అజ్మీరా వీరన్న, వాంకుడోతు నరేష్, రాంకిషోర్, వెంకటయ్య, తిరపతయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

**గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె నోటీస్**

**ఏన్కూరు:** గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన కోర్కెలు పరిష్కారించాలని కోరుతు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెంట్ తాళ్లూరి కృష్ణకు శనివారం పంచాయతీ కార్మికులు సమ్మె నోటీస్‌ను అందించారు. కార్యక్రమంలో కార్మికులు గాంధీ, బిక్షమయ్య, ముత్యాలరావు, రాములు తదితరులు పాల్గొన్నారు.